423118801

భానుతేజముకంటె భాసిల్లుచుండును
మంచు తెలుపు కంటె మించియుండు
ఆకాశముకన్న అతిసూక్ష్మమై యుండు
సర్వజీవుల యందు పర్వియుండు
బ్రహ్మంబు కానిది యిలను యేదియు లేదు
సర్వజీవులందు సంచరించు
బ్రహ్మయే మీరు మీలోన బ్రహ్మయుండె
మీకు బ్రహ్మకు భేదంబు లేకయుండె
ఇంతకన్నను వేదాంతమేమి చెప్పుదు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులారా!
నేనె వెలుగులో నున్నాను నేనె వెలుగు
వెలుగు నాలోన నున్నది వెలుగు నేనె
అట్టి జ్ఞానము మనసున హత్తుకొన్న
అతడె బ్రహ్మంబు బ్రహ్మమే అతడౌను.

దివ్యాత్మస్వరూపులారా!

భగవంతుని మానవ రూపము, భగవంతుని యొక్క ఉపాధి లేక ప్రతిబాదికము మానవమాత్రుడైన వాడే గుర్తించుటకు వీలగునుగాని అన్యులు దీనిని తెలుసుకొనలేరు. కనుక మానవ రూపమునే మనము గుర్తించవలెను గౌరవించవలెను. దైవం మానుష రూపేణ. భగవంతుడు మనుష్యాకారమును ధరించి, జగత్తును పరించి ప్రజలను ప్రేమించి, మానవులను అనుగ్రహించే నిమిత్తమై భగవంతుడు అవతరించును

ఈ ప్రకృతి అంతయు కూడా మంటగుండు. ఈ మంటగుండు లోని లో భాగమునందు పై భాగమునందు సర్వత్ర నిండియుంటుంది. అదే విధముగా అంతర్బహిశ్చ తత్ సర్వ వ్యాప్య నారాయణ స్థితః. భగవ తత్వమనేది, ఆత్మతత్వమనేది బ్రహ్మతత్వమనేది సర్వత్రా వ్యాపించినదే. 'ఈశావాస్యమిదం సర్వమ్' అనగా భగవంతుడు యీ జగత్తునందు సమస్త పదార్థములందు వున్న దివ్యశక్తియే. అట్టి సర్వత్రా వుండిన దివ్యత్వాన్ని మానవుడు మాత్రమే గుర్తించగలడు గాని, అన్యులు దీనిని గుర్తించలేరు. దీని గుర్తింప యత్నించిన మానవుడు లేనొక వికార దృశ్యమును నిర్మించుకొని, దానినే భ్రమించి యిదియే సత్యమని భ్రమించవచ్చు.

4231188O2

ఈనాడు జగత్తులో, ప్రపంచమును గురించి, సమాజమును గురించి అనేక వస్తువుల గురించి అద్భుతమైన రీతిగా వైజ్ఞానికముగా వుపన్యసించవచ్చును. కీర్తి ఘనతలను ఆర్జించవచ్చును. మనుష్యాకారమును ధరించిన దైవత్వమును కూడా అనేక విధములుగా విమర్శించవచ్చును. కానీ యివన్నీ కూడా కల్పనలు మాత్రమేగానీ యిందులో యదార్థము యే మాత్రము యిమిడి వుండదు. వాచాలుడైన పండితుడు యేవిధమైన ప్రగల్భములు చెప్పవచ్చుగాని, నిజమైన దివ్యత్వాన్ని యే మానవుడు చూడలేదు, చూడలేరు. దాని నిజస్వరూపమును మానవస్వరూపమునందే గుర్తించటానికి వీలవుతుంది గాని అన్యమార్గములందుగాని, అన్య సాధనలయందుగాని దివ్యత్వాన్ని గుర్తించలేరు, నిరూపించలేరు. తాము గుర్తించుకున్నది తమయొక్క భ్రాంతులే, తమ యొక్క కల్పనలే. ఒక ఏనుగు భగవంతుని అర్చించవచ్చు. అది తన ప్రకృతి సౌలభ్యమును పురస్కరించుకొని భగవంతుని పెద్ద ఏనుగుగా నిర్ణయించుకొనవచ్చును అంతగాని అంతకంటె వేరొక స్వరూపాన్ని నిర్ణయించుకొనలేదు. ఎలుక కూడా భగవంతుని అర్చింపగోరి తన ప్రకృతిని పురస్కరించుకొని భగవంతుని తనకంటె ఎన్నోరెట్లు బ్రహ్మాండమైన ఎలుకగా తాను నిర్ణయించుకొనవచ్చును. అదే విధముగా మానవుడు తన ప్రకృతిని పురస్కరించుకొని తాను కూడా మానవాకారమునే నిర్ణయించుకొనవచ్చును తప్ప అన్యమైన, అతీతమైన మానవత్వాన్ని నిర్ణయించుకొనటం సాధ్యము కాదు. నేను మానవుడను అనుకొన్నంత వరకు మానవాతీతమైన దివ్యత్వాన్ని మానవుడుగా గుర్తించుకోవాలి తప్ప అన్యముగా గుర్తించుకోటానికి వీలుకాదు. కాని వాచాలురు అయినవారు అనేక వర్ణనలు చేయవచ్చును కొంతమంది పండితులు భగవంతుడు అప్రమేయుడు అవాఙ్మానసగోచరుడు, నిర్గుణుడని వర్ణిస్తారు. కేవలము యిందులో పదముల ప్రాబల్యము బాగా కనుపించవచ్చు తప్ప అందులో వున్నది సున్నగే. కారణమేమనగా యీ పదములకు అర్థములనేయవచ్చును. ఈ పదములను నానార్థములుగా విభజించవచ్చును. కానీ తమ అనుభవము లోపల యిది నిరర్థకమే, అనర్థమే, యదార్థము కానేరదు.

ఏ సమయమునందైనా నీకు అనుకూలములు సంభవించినప్పుడు ఏ పండితుడైనా అప్రమేయుడనగా ఏమిటి అని ప్రశ్నించండి. ప్రమాణములకు చిక్కనివాడని సమాధానము చెబుతాడు. భగవంతుడు అవాఙ్మానసగోచరుడు అని వర్ణిస్తాడు. మనస్సుకు, వాక్కుకు అతీతమైనవాడు భగవంతుడు అని అర్థము చెప్పవచ్చును. అంతేగాని యింతకంటె భగవంతుని స్వరూపాన్ని నిరూపించలేడు కదా. నా వృద్ధాశ్రమములో యిలాంటి పదములకు అర్థము నిరూపించే పండితుని కంటె సామాన్య మానవుడే మేలని నాకు అనిపిస్తుంది. కారణమేమనగా ఈ అర్థములను సామాన్య మానవుడు కూడా చెప్పగలడు గాని ఆ మానవుడు మౌనము వహిస్తాడు. తద్వారా సమాజములో కొంత శాంతి యేర్పడుతుంది. ఈ పండితుడు చెప్పే అర్థాల వల్ల సమాజములో కొంత

అలజడులు యేర్పడుతున్నాయి. సమాజములోని శాంతిని విరుద్ధపరుస్తున్నారు. ఈ విధముగా ప్రపంచములో అశాంతిని విజృంభపరచటము కంటె పదములకు అర్థము చెప్పకుండా మౌనము వహించటమే గొప్పతనమని చెప్పవచ్చు. కనుక ఆనాటినుండి యీనాటి వరకు పదములను వర్ణించి, ఆపదముల అర్థములను బోధిస్తూ వస్తున్నారు గాని దాని యదార్థస్వరూపాన్ని యింతవరకు ఎవ్వరూ నిరూపించలేదు. సర్వుల యందుండిన దివ్యత్వమే భగవంతుడు. సర్వరూపము లతనివే. ఇలాంటి దివ్యత్వాన్ని యే విధముగా వర్ణించగలడు? ఏది నిశ్చయమని చెప్పగలడు

బ్రహ్మ యిదియని చెప్పంగ గలరు గాని
కాదు కాదిది యని ఎవరు చెప్పంగ గలరు.

ఇది కేవలము మానవత్వము యొక్క బలహీనతయే.

పుష్పములోని సుగంధము వలె మానవునిలోని దివ్యత్వము సుగంధముగా నిరూపిస్తుంది. కట్టెలోని అగ్నివలె, తిలలోని తైలము వలె, మానవుని యందు దివ్యత్వము సర్వత్రా వ్యాపించి వున్నది. కాని యీ అంతర తత్వాన్ని గుర్తించుకొనలేక కేవలము బహిర్ముఖమైన రూపములనే భ్రమించి, అదియే సత్యమని భావిస్తున్నారు. కాని ప్రాచీన కాలము నుండి యీ బోధనలు పురస్కరించుకొని మానవుడు తన అజ్ఞానమును మరింత అభివృద్ధి చేసుకొని వస్తున్నాడు, పుట్టలో పాముకు పాలు పోస్తున్నారు. కానీ పామును చూస్తే చంపివేస్తున్నారు.

సేవ చేయునట్టి సేద్యపు పశువును
చోరి చితగ గొట్టు చిత్రముగను
రాతి ఎద్దును చూచి రక్తితో పూజించు

ఇది ప్రాచీన కాలము నుండి వచ్చిన మన వేదాంతము. సజీవులను హింసించటము, నిర్జీవులను పూజించటము భారతీయుల బలహీనత. ఆకలిగొన్న మానవునకు పట్టెడన్నము పెట్టని మానవుడు భగవంతునకు అతిరుచికరమైన పదార్థములను అర్పిస్తున్నాడు.

ముడుపులందు ధనము మూటగట్టి
బిచ్చగానికి మెతుకైన పెట్టకుండ
వెంకటేశుని హుండిలో వేయు లోభి.

ఈ విధముగా ప్రాచీన సాంప్రదాయాన్ని పాలిస్తున్నారు. నిజముగా సజీవముగా వున్న వ్యక్తికి పట్టెడన్నము పెడితే ఎంత సార్థకము! కనుక మనము దైవము మానుష రూపేణా మానవ రూపములో వున్నదన్న సత్యాన్ని మనము గుర్తించాలి. వర్తించాలి. జీవుని బాధించటము, దేవుని పూజించటము యిదియా మన కర్తవ్యము

ఆకాశమునందు వాయువు యే విధముగా లీనమై వున్నదో అదే విధముగనే ప్రకృతి అంతయు ఆత్మయందు లీనమై వున్నది. గాలికి ఆకాశము వుపాదాన కారణము

ఉపాదాన కారణమనగా దేని వలన యది సృష్టింపబడుతున్నదో, సృష్టించేది ఉపాదాన కారణము. ఆకాశము ఆశ్రయము, గాలి ఆశ్రితము. గాలికి ఆశ్రయము ఆకాశము. ఆకాశమునకు గాలి ఆశ్రితము. ఈ రెండింటికి అవినాభావ సంబంధము అన్యోన్యాశ్రయము అదియే భగవంతునకు, మానవునకున్న సంబంధము. కనుకనే ఆత్మయందు తాను, తనయందు ఆత్మ అన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించి వర్తించినప్పుడే యీ దివ్యత్వమనేది మనకు అర్థమవుతుంది

ఈ జగత్తునందు ఐదు విధములైన స్వరూపములలో మానవత్వము అవతరిస్తూ వస్తున్నది. ఇవన్నీ కూడా కళలను పురస్కరించుకొనే అవతరిస్తూ వచ్చాయి. ఒకటి నిత్యావతారము. రెండవది విశేషావతారము. మూడవది అవిశేషావతారము. నాల్గవది లీలావతారము. ఐదవది పూర్ణావతారము. ఈ లీలావతారమే అంశావతారమని కూడా చెప్పవచ్చు. నిత్యావతారము, విశేషావతారము, అవిశేషావతారము ఐదునుండి తొమ్మిది వరకున్న కళల స్వరూపములు మాత్రమే. ఒక పూర్ణావతారమే పదహారు కళలతో నిండి వుంటుంది. అట్టి పూర్ణావతారమునే దైవత్వముగా మన పూర్వీకులు విశ్వసిస్తూ వస్తున్నారు. ఏతావాతా ప్రతి మానవుడు కూడా అవతారమే. అవతరించటము చేతనే అతనికి అవతారము అని పేరు. అంతేగాని దైవము యీ జగత్తులో ప్రత్యేకమైన స్వరూపమును ధరించి వికారము చేత జగత్తులో సాక్షాత్కరించటము లేదు. ఒక ఏనుగు, ఒక ఎలుక, ఒక మానవుడు భగవత్ సముద్రమునకు వెళ్ళి తనయందు ఆ సముద్రము యొక్క అనుగ్రహాన్ని నింపుకొని రాగలడు. ఏనుగు, ఎలుక, మానవుడు పాత్రల వంటివారే. ఆ పాత్రను పురస్కరించుకొనే దైవత్వమనే జలమును నింపుకొని రాగలరు. రూపమునందు భేదముండవచ్చును గాని వానియందుండిన జలము భగవత్ తత్త్వమే. సర్వుల యందుండిన భగవంతుడు ఒక్కడే. అందరూ అవతార స్వరూపులే.

దైవమును వెతకటంకోసం మనము ప్రత్యేకమైన ప్రదేశమునకు మనము పోనక్కరలేదు. ప్రతి మానవుని గౌరవించండి. ప్రతి మానవుని ప్రేమించండి. ఈ ప్రేమ అనేది సేద్యముతో పండించుకొనే పంట కాదు. ఈ ప్రేమనేది అంగడిలో పెట్టి కొని అమ్మేది కాదు. ప్రభువుగాని, సామాన్య ప్రజలుగాని, అహంకారమును వదలి త్యాగమునకు పూనుకొన్నప్పుడే ప్రేమ ఆవిర్భవిస్తుంది. నే

నేను నేనుగా వున్నంత నీవుగావు
నీవు నీవుగా వున్నంత నేనుగాను
నీకు నాకు యిందులో స్థలము లేదు
ఉన్న దొక్కటే హృదయంబు ఎన్నగాను.

. ఈ హృదయమనేది నేను, నీవు కూర్చునే chair కాదు. ఇది double sofa కాదు. ఇది musical chair కాదు. ఇదే ఏకం సత్ విప్రా బహుధా వదంతి. ఆ నిజమైన తత్త్వమే

423118805

హృదయము. ఆహృదయమే ఒక్కటిగాని రెండు కాదు. నీవు నేను అన్నభావములు త్యజించి ఏకత్వాన్ని వరించి, దైవత్వాన్ని భ్రమించి, దివ్యత్వాన్ని అనుభవించినప్పుడు నీవే అవతార పురుషుడవు.

ప్రేమ స్వరూపులారా! మానవత్వము అసార్థమైనదనిగాని లేక భ్రమతో కూడినదనిగాని అజ్ఞానములో వున్నదనిగాని మనము భ్రమించరాదు. మానవ జన్మ దుర్లభమైనది. ఇట్టి మానవ జన్మ యెత్తియు తన తత్వాన్ని తాను గుర్తించుకోటానికి ప్రయత్నించుకొనక, బాహ్య జగత్తునందు భగవంతుడు కలడని భ్రమించుకోటము ఇదే పెద్ద అజ్ఞానము. కనుక కాలమును వ్యర్థము చేయక, కాలమును సార్థకము గావించుకొని, కాయముతో కర్మలాచరించి దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించండి. ఈ విధమైన మానవత్వాన్ని గౌరవించటానికి ప్రయత్నించండి. నిజముగా దైవమును పూజించాలనుకున్నప్పుడు మానవాకారముతోనే పూజించండి. ఏ ఆకారము మనము భ్రమించినప్పటికి అవి కృత్రిమమైనవే. అవి కల్పనలతో కూడినవే. ఇవి భ్రమలతో చేరినవే. ఈ భ్రమ పోయేటంతవరకు బ్రహ్మ మనకు సాక్షాత్కరించడు. కనుక యీ భ్రమలను మనము దూరము చేసుకోవాలి.

ఎంతోమందో, ఎన్నివిధములుగానో భగవంతుని వర్ణిస్తూ వస్తున్నారు. వేదశాస్త్ర యితిహాస పురాణములందు చక్కని ప్రమాణములను బోధిస్తున్నారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములందు యీ బ్రహ్మ తత్వాన్ని అనేక విధములుగా వర్ణిస్తూ వస్తున్నారు ఈ వాచాలుడు వర్ణనలలోనే తృప్తి పడుతున్నాడు గాని యీ వర్ణాకారాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. దీని ఆకారమేమిటి? ఒకవేళ దీని ఆకారాన్ని నీవు చూడటానికి యిష్టపడితివా యిదికేవలము ఒక వికారముగా రూపొందుతుంది. నీ ఆకారాన్ని నీవు దైవత్వముగా విశ్వసించుకో. నిన్ను నీవు గౌరవించుకో. ఇతరులను గౌరవించు నిన్ను నీవు ప్రేమించు. యితరులను ప్రేమించు. ఇలాంటి దివ్యమైన విశాలమైన భావాన్ని ప్రాచీనకాలమునుండి కూడా ప్రచారప్రబోధలు లేకుండా పోవటము వలనే మానవుడు యిన్నివిధములై అజ్ఞానమునకు గురి అయిపోవుచున్నాడు.

భగవంతుడు అవతరించటము గాని, అంత్యమొందుటగాని వుండదు ధరించిన దేహము నీటి బుడగ వంటిది.

నీటి యందె పుట్టి నీటిసే పెరిగి
నీటి యందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు
సత్యమైన బాట సాయి మాట

జలమునందు నీటిబుడగ పుట్టి, జలమునందు పెరిగి, జలమునందే లయమైపోయిది. మానవుడు కూడా అంతే బ్రహ్మయందే పుట్టి, బ్రహ్మయందె జీవించి, బ్రహ్మయందె

లయమొందుచున్నాడు. భ్రమ కానిదే బ్రహ్మ. జీవితమంతా భ్రమలతోనే నిండిపోయినది. జీవితమంతా భ్రమలతోనే జరుగుతున్నది. మమత్వమనే భ్రమ. అహంకారమనే భ్రమ ఈ రెండింటిని దూరం చేసుకోవాలి.

కనుక మనము దైవత్వాన్ని గుర్తించి, దైవత్వాన్ని విశ్వసించి, దైవత్వాన్ని ఆరాధించగోరే ప్రతి మానవుడు మానవాకారాన్నే ఆరాధించాలి. విశ్వరూపములో వున్న భగవంతుని ఏ విధముగా ఆరాధించగలవు? ఏది నీవు అర్పించగలవు?

బ్రహ్మాండమంతట ప్రబలుచుండిన తనకు
ఆలయంబు సమర్పలవి యగునా
కోటి సూర్యుల కాంతి మేటి గల్గిన తనకు
ప్రమిద దీపము నెవరు పట్టగలరు
ఆదహారాదులకైన అందని వానిని
యే రూపు వర్ణించ ఎవరి తరము
సర్వజీవులయందు సంచరించెడి తనకు
సరియైన బెండె సాధ్యమగునా
బ్రహ్మాండమంతయు బొజ్జలో నున్నట్టి తనకు
భక్ష్య భోజ్యములు పెట్ట తగున
వసుధ తెలుపుచునున్నది సాయిబాబ యనుచు
వసుధ తెలుపుచునున్నది శ్రీరామ యనుచు
వసుధ తెలుపుచునున్నది శ్రీకృష్ణ యనుచు
వసుధ తెలుపుచునున్నది జీసస్సు అనుచు
వసుధ తెలుపుచునున్నది అల్లా యటంచు
వసుధ తెలుపుచునున్నది జోరాస్ట్ర యనుచు
వసుధ తెలుపుచున్నది శ్రీ బుద్ధుడనుచు
ఇంతకన్నను వేరెట్టి ఎరుగరయ్యా
అంతట నున్నది ఒక్కటే ఆత్మ అనుపం.

కనుక దైవమును సర్వాకారములో ఆరాధించి, సర్వజ్ఞత్వముతో పూజించి సమత్వములో చేర్చుకొనే మన భావమే మన ఆరాధన.

ప్రేమ స్వరూపులారా! భగవంతుని ప్రధానమైన స్వరూపము ప్రేమయే. భగవంతుని స్వరూపము సత్యమే. అది పరమాణువుల కంటె కూడా అతి సూక్ష్మముగా వుంటుంది. కనుకనే truth is more fundamental than atom అన్నారు. సైంటిస్టులు atom అతి సూక్ష్మమైనదిగా భావిస్తున్నారు. అన్నింటి కంటె అతి సూక్ష్మమైనది సత్యము. సత్యము సర్వత్ర వ్యాపించినటువంటిది. అట్టి సత్యస్వరూపాన్ని గుర్తించి

423118807

ఆరాధించటం అత్యవసరము. సత్యాన్ని కేవలము విస్మరించి, సత్యస్వరూపుని పూజించినంత మాత్రమున తాను సత్యస్వరూపుడు కానేరడు. కనుక మనము సత్యాన్ని పాటించాలి. ఈ సత్యమునుండి ఆవిర్భవించినదే ధర్మము. ధర్మము మన హృదయ స్థాయినుండి యేర్పడినదే. తనకు తాను తృప్తి కలిగించునదే ధర్మము. ఈ ధర్మము self consciousness ఈ ఉత్తమమైన జీవితమునందు మనము విశ్వసించాలి. తన conscience కు ఎవరూ ఎదురుగా పోకూడదు. ఈ విధముగా పోవటమే వికృతము conscience కు తగినట్లుగా ప్రవర్తించటమే సుకృతము. సరైన మార్గములో సరైన తృప్తినందుకోటమే ఆరాధన. మనస్సులో ఒకటి, మాటలో మరొకటి యిది దివ్యత్వమునకు సన్నిహితము కాదు. కనుక మనము మనసునందును, మాటయందును, క్రియయందును ఏకస్వరూపాన్ని ధరింపచేయాలి.

మన యొక్క బ్రతుకు నిమిత్తము మనమిన్ని బాధలు పడుతున్నాము గాని దైవము ఒక్కడే. నీ ఆకారములు, నీ సిద్ధాంతములు వ్యక్తిగతమైనవే గాని, సమిష్టి స్వరూపానికి సంబంధించినవి గావు. సమిష్టి స్వరూపమే దైవము. అందరియందుండిన ఏకత్వమే దైవత్వము. ప్రతి వ్యక్తి యందు ప్రేమ, సత్యము నిండి వుంటున్నవి. ప్రేమలేని మానవుడు జగత్తున కానరాడు. ఈ ప్రేమను వివిధ మార్గములలో ప్రవేశపెట్టవచ్చును గాని, ప్రేమ మాత్రము ఒక్కటే. ఆ ప్రేమయే దైవము, ఆ ప్రేమయే సర్వులయందు వుండినది. ఆ ప్రేమకు విరుద్ధమైన మార్గమును అనుసరించవద్దు. కనుకనే దైవత్వమును వివిధ రూపములతో ఆరాధించినప్పటికి, ఆ తత్వము ఏకత్వమైన ఆత్మతత్వముగా విశ్వసించుకోటము అత్యవసరము. పువ్వులు యెన్నైనా వుండవచ్చు పూజ ఒక్కటేనన్న సత్యాన్ని గుర్తించాలి. అదే విధముగా ఆకారములనేకము వుండవచ్చు ఆత్మతత్వము ఒక్కటే అని గుర్తించాలి. తరువాత మీరు గుర్తించవలసినది ఒక్కటి మాత్రమే.

దైవము ఎక్కడో, ఏదో స్థానములో వున్నాడనే భ్రమను దూరము చేసుకోండి. నేనే దైవమనే దానిని విశ్వసించండి. మిమ్మల్ని మీరు దైవముగా భావించండి. అప్పుడు ఎట్టి పెడమార్గముల పట్టుటకు వీలుకాదు. దైవ మార్గము అనుసరిస్తూ పొండి. ప్రతి మానవుని యందు దైవమున్నాడని విశ్వసించండి. 'ఈశావాస్యమిదం సర్వమ్' 'వాసుదేవమిదం సర్వమ్' 'ఏకోవశి సర్వభూతాంతరాత్మ'. ఇన్ని విధములుగా వేదములు ఉపనిషత్తులు తెలుపుచున్నప్పటికి, దానిని మనము తెలుసుకొనలేక కేవలము పాండిత్యము లోపల మన జీవితాన్ని పాడుచేసుకుంటున్నాము. అనేక గ్రంథములను చదివినంత మాత్రమున పండితుడు కాలేడు. గొప్ప ఉపన్యాసము లిచ్చినంత మాత్రమున పండితుడు కాలేడు. వేద శాస్త్ర యితిహాస పురాణములు కంఠస్థము గావించినంత మాత్రమున పండితుడు కాలేడు. పండితాః సమదర్శినః అన్నారు. సమదర్శనము గలవాడే పండితుడు. ఆ పండితుడు భిన్నమార్గమును యెప్పుడూ అవలంబించడు. పండితుల

కంకణములు ధరించవచ్చు. గొలుసులు వేసుకొనవచ్చు. కర్ణకుండలములు ధరించవచ్చు ఇవి బాహ్యమైన ఆడంబరములు తప్ప ఆనందము అతనిలో శూన్యము. కనుకనే మనము గ్రంధములు వ్రాసేటప్పుడు గాని, గ్రంధములు చదివేటప్పుడు గాని భగవంతుడు ఒక్కడే అన్న సత్యాన్ని విశ్వసించి ఆరాధన చెయ్యాలి. నూరు మనము చెప్పటము కంటె ఒకటి చేసి చూపించటము చాలా అవసరము. ఆచారము ప్రధానముగాని, ప్రచారము ప్రధానము కాదు. ప్రచారము చేతనే నాస్తికత్వము అభివృద్ధి గాంచుచున్నది. ఏ గ్రంధములు వ్రాసినామో, ఏ విషయములు ప్రబోధించినామో దానికి విరుద్ధముగా ప్రవర్తిస్తున్నాము. ఇది యే తనకు తాను ద్రోహము చేసుకోటం. ఇలాంటివి మనకు మనము దూరము చేసుకోవాలి. సర్వులూ ఒక ప్రభువు బిడ్డలుగా మనము భావించాలి. దాని యొక్క అంశములుగానే మనము విశ్వసించాలి. మనలో వున్న అంశములు మనము పెంచుకోవాలి. అప్పుడే మనము అవతార పురుషులుగా తయారౌతాము.

అవతార పురుషులకు మీకు తేడా లేదు. అన్ని అవతరించనటువంటివి. ఈ కళల యందు మాత్రమే భేదమున్నది. ఈ కళలను మనము ఆచారము చేస్తే అభివృద్ధి గావించుకోవచ్చును. సమత్వాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. పవిత్రమైన ప్రేమను మనము పెంచుకోవాలి. అప్పుడే అది అభివృద్ధి గాంచుతుంది. క్షణక్షణమునకు తిరిగేటువంటిది, క్షణక్షణమునకు పెరిగేటువంటిది ప్రేమ కానేరదు. చావు పుట్టుక లేనట్టి జీవ నదిని నిరంతరము ప్రకాశించేది, వికసించేది ప్రేమ. కష్టనష్టములకు, నింద నిష్ఠురములకు లేక వర్ణనలకు పొంగక కృంగక వుండేటువంటిదే నిజమైన ప్రేమ. కాని కొన్ని విధమైన లాభనష్టములకు కృంగటము, పొంగటము, దూషణ భూషణాలకు కృంగటం, పొంగటం, కష్టసుఖములకు కృంగటం పొంగటం యిది ప్రేమ కానేరదు. ప్రేమ కదలక, మెదలక నిశ్చలమై వుంటుంది. అటువంటి ప్రేమ యే నిజమైన భక్తి. ఈనాడు మనకు దండిగా ఆదాయము వచ్చినప్పుడు మనకోరికలు ఫలించినప్పుడు పాటలు ఎక్కువ పెడతాము, దండిగా హారాలు పెట్టి పూజిస్తాము. మన కోరికలు విఫలమాయినా ఫొటోలు తీసేస్తాము. ఇది నిజమైన ప్రేమ అవుతుందా.

సర్వ పదార్థములందు భగవత్ తత్త్వము వుంటున్నది. కానీ మానవునకు మానవాకారమే సన్నిహితము. ఇట్టి సన్నిహితమైన మానవత్వాన్ని మనము గౌరవించాలి. ఆ గౌరవించే విధానము తెలుసుకున్నప్పుడు అది నిజమైన ఆరాధన అవుతుంది. సర్వ మానవులయందున్న దైవత్వాన్ని భజించుట ముఖ్యావసరము. ఇది యీనాడు మీరు గుర్తించవలసిన ప్రధానమైన విషయము. రాముడు, కృష్ణుడు అనేవి మానవాకారములను ధరించినవే. ప్రాచీన కాలమునుండి మనము ఆరాధించిన ప్రతి ఆరాధనా స్వరూపము మానవాకారమే. కనుక మానవాకారమునే గౌరవించి, ఆరాధించుట

423118809

మే ప్రధానమైన పూజ. సర్వజీవులు భగవంతుని ఆకారముగా విశ్వసించటము అత్యవసరము సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.

ఇక్కడ కేశవ అన్న పదము ఎందుకు వుపయోగపెట్టారు. ఇందులోనే సృష్టి స్థితి లయములు యిమిడి వుంటున్నాయి. కేశవలో క, ఈశ, వ అని వున్నాయి. ఈ మూడూ చేరితే కేశవ అవుతుంది. క అనగా బ్రహ్మ ఈశ అనగా ఈశ్వరుడు వ అనగా విష్ణువు. కేశవ అనగా బ్రహ్మ, ఈశ్వర, విష్ణు స్వరూపమే అని అర్థము. బ్రహ్మ అనగా సృష్టి తత్వము. మన సంకల్పమే బ్రహ్మ తత్వము. ఈశ అనగా హృదయ వాసమే. కనుక మన హృదయమే ఈశ్వర తత్వము. బుద్ధి తత్వమే సర్వత్రా వ్యాపించిన విష్ణుతత్వము. యంత్ర, మంత్ర, తంత్ర స్వరూపములైన విభూతులు వుంటున్నాయి. మన దేహమే ఒక యంత్రము. ఇందులో ప్రతి అంగము ఒక దానిని ఒకటి అనుసరించి పని చేస్తున్నాయి. అందువలన మన దేహము ఒక యంత్రము. మన శ్వాస ఒక మంత్రము. మన హృదయమే తంత్రము. యంత్ర, మంత్ర, తంత్ర స్వరూపము మానవాకారమే, అన్య స్వరూపములు కాదు. దానిని విశ్వసించాలి.

ఈ మానవాకారముతో చేయవలసిన సత్కర్మలు మనము చెయ్యాలి. Human value అనగా యేమి? దైవత్వమే నిజమైన Human value. అటువంటి విలువను మనము తెలుసుకోవాలి. ఈ value మనలో క్రొత్తగా వచ్చి ప్రవేశించినది కాదు, ఈ దేహములో కూడ అవి ఆనాడే ఆవిర్భవించాయి. మనము అవసరాన్ని అనుసరించి దానిని అణగద్రొక్కుతున్నాము. స్వార్థమే దానికి మూలకారణము. స్వార్థము వచ్చేసరికి ద్వైతము ఆరంభమవుతుంది. ద్వైతము వచ్చేసరికి రాగద్వేషములు ప్రారంభమవుతాయి. ఈ రాగద్వేషముల చేతనే మనలో భవరోగము ప్రారంభమవుతుంది. ఈ రోగములు మనము నివారణ చేసుకోవాలంటే భజన అవసరము.